క్లుప్తంగా

పునర్వసు కల్యాణం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్ర సందర్భంగా గురువారం మాస కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకుని వచ్చారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యూత్రా ధారణ, యజ్ఞోపవీత ధారణ, స్వామి వారి అమ్మవారి ప్రవర్లు, మధుపర్కాలు, మహా సంకల్పం మంగళాష్టకాలు, జీలకర బెల్లం మాంగల్య పూజ మాంగల్య ధారణ మంగళ హారతి, మంత్రపుష్పం చేపట్టి కల్యాణతంతు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్,ఆలయ ముఖ్య అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, అర్చకులు భార్గవాచార్యులు, భాస్కరాచార్యులు, నలదీగల నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్‌పీ) జనరల్ బాడీ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సోలం హరిశంకర్, ప్రధాన కార్యదర్శిగా మడి రమేష్, ఉపాధ్యక్షుడిగా పాల్వంచ శ్రీను, కోశాధికారిగా మడకం రవి, కార్యదర్శులుగా కంగాల ప్రవీణ్, కొమరం కోటి, గొగ్గెల కోటి, వాడ రాంబాబులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి నూపా సీతయ్య, బట్టా కనకరాజు, డివిజన్ నాయకులు తుర్రం రవికుమార్, వాగబోయిన శ్రీను, సోలం రమణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

అశ్వాపురం: మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో ఉన్న పలువురిని గురువారం రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య పరామర్శించారు. మండలంలోని మొండికుంట గ్రామానికి చెందిన మేరెడ్డి చలపతిరెడ్డి ఇటీవల వాహన ప్రమాదంలో గాయపడి కాలుకి శస్త్ర చికిత్స చేయించుకోగా.. పొదెం వీరయ్య అయనను పరామర్శించారు. అదే గ్రామంలోని మాజీ ఉప సర్పంచ్ కొండా బత్తుల ఉపేందర్‌కు బైపాస్ సర్జరీ కాగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లపు దుర్గాప్రసాదరావు, మొండికుంట, మల్లెలమడుగు గ్రామాలకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చర్యలు తీసుకోండి

ములకలపల్లి: ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మూకమామిడి గ్రామపంచాయతీ ప్రజలు గురువారం తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. మూకమామిడి గ్రామానికి చెందిన పలువురు ట్రాక్టర్లలో అర్ధరాత్రి వేళ అక్రమంగా ఇసుక తోలకాలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాలకు దొంగచాటున ఇసుక సరఫరా చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ట్రాక్టర్లను సీజ్ చేయాలని, సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్థానిక పెసా కమిటీ ఉపాధ్యక్షుడు పాడియం ప్రేమ్‌కుమార్, కార్యదర్శి ఎస్.వీరస్వామి, నాగేష్, నవీన్‌కుమార్, చిట్టిబాబు, బాబూరావు, అశోక్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ములకలపల్లి: హమాలీ కార్మికులకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలపరిధిలోని నర్సాపురం శివారు కోటెమ్మ ఆలయం వద్ద నకిరకంటి పుల్లారావు అధ్యక్షతన నిర్వహించిన హమాలీ కార్మిక సంఘ 6వ మండల మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. అనునిత్యం రెక్కల కష్టంతో బతుకు బండిని లాగిస్తున్న హమాలీలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. తొలుత సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘ జిల్లా కార్యదర్శి ఎండి.యూసఫ్, వేల్పుల మల్లికార్జునరావు, మండల కార్యదర్శి ఎస్‌కె.జబ్బార్, నాయకులు నరాటి రమేశ్, అనుమల సాయి, మిర్యాల వెంకన్న, నిమ్మల వెంకటేశ్వర్లు, గద్దల రమేశ్, ముళ్లపూడి కేశవులు, వీరయ్య పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి

అశ్వారావుపేటరూరల్: వెంకమ్మ చెరువు కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే నష్ట పరిహారాన్ని చెల్లించాలని ఆధార్ పార్టీ జిల్లా చైర్మర్ కంటే కేశవ్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం అశ్వారావుపేట తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.1లక్ష మాత్రమే కేటాయించారని, దీనిని తక్షణమే ఎకరానికి రూ.8లక్షలకు పెంచి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొట్టా రాజులు, మడకం నాగేశ్వరరావు, మడకం కృష్ణ పాల్గొన్నారు.

రోజూ వర్షం.. రైతులకు నష్టం

- తుఫాన్ ప్రభావంతో వరుసగా వానలు
- పత్తి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం


వర్షాలకు తడిసి ముద్దయిన పత్తి


మిర్చి పంటలో చేరిన వర్షపునీరు

చంద్రుగొండ: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతుల పాలిట శాపంగా పరిణమించాయి. తీసే దశకు వచ్చిన పత్తి, చివరిదశలో వేసిన మిర్చి పంటలకు నష్టం చేకూరుతోంది. వేలాది రూపాయలు పెట్టుబడులు వెచ్చించి ఆరుగాలం శ్రమించి సేద్యం చేసిన పత్తి పంట ప్రస్తుతం తొలి కాపు కాసింది. ఈ క్రమంలో వర్షాలకు కళ్ల ముందే పత్తి పంట నీళ్ల పాలౌతుండటంతో రైతులు కంట నీరు కారుతోంది. చీడపీడల నుంచి రక్షించి చేతికొచ్చిన పంట, ఇంటికి వచ్చే పరిస్థితి కన్పించడం లేదు.

మండలంలో ఈ ఏడాది పత్తి 8,090 ఎకరాల్లో, వరి 4,470 ఎకరాల్లో, మిర్చి సుమారు 2 వేల ఎకరాల్లో సేద్యం చేశారు. ఆరుగాలం శ్రమించి సేద్యం చేసిన పంటలు వర్షాల ధాటికి తడిచి పోతున్నాయి. సీజన్ తొలిదశలో వేసిన వరి పంట కోత దశకు చేరుకుంటోంది. కాగా తొలివిడత తీసే దశకు వచ్చిన పత్తి పంటకే ప్రధానంగా నష్టం జరుగుతోంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం కారణంగా నష్టపోతున్నాం..



రోజూ వర్షం కారణంగా పత్తి పంట నష్టపోతున్నాం. మూడు ఎకరాల్లో పత్తి పంట సేద్యం చేశాను. రూ.1.5 లక్షల పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం పత్తి తేసేందుకు సన్నద్ధం అవుతుండగా వర్షాలతో పత్తి తడిసిపోతోంది.

– వేల్పుల వీరయ్య, పత్తి రైతు, తిప్పనపల్లి

చేతికందిన పంట నేలపాలౌతోంది..



వర్షాల కారణంగా చేతికి వచ్చిన పత్తి పంట నేలపాలవుతోంది. నాలుగు ఎకరాల్లో పత్తి పంట సేద్యం చేశాను. తొలికాపుగా వచ్చింది. పత్తి తీద్దామనుకుంటే రోజు వర్షం పడుతోంది. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నాం.

– ఎస్‌కె.కరీం, పత్తి రైతు, మహ్మద్‌నగర్

ఆర్థిక బలోపేతమే లక్ష్యం

అశ్వారావుపేటరూరల్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. గురువారం అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి వివిధ కార్యక్రమాలకు హాజరయ్యారు. ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను 'మీ ఎమ్మెల్యే మీ ఇంటికి'కార్యక్రమంలో భాగంగా నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు. అలాగే మొద్దులగూడెం గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి, స్థానికులతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నిధులు మంజూరు చేసి ఆయా సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇందిరా మహిళా శక్తి పథకం స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా మంజూరైన రూ.4కోట్ల 24లక్షల చెక్కును లబ్ధిదారులకు అందించారు. అలాగే మత్స్యశాఖ ద్వారా మండలంలోని 49 సాగునీటి చెరువులకు వందశాతం సబ్సిడీపై మంజూరైన 3లక్షల బొచ్చె చేప పిల్లలను మత్స్యకారులకు, సంఘాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మత్స్యశాఖ జిల్లా అధికారి ఎండి.ఇంతియాజ్ అహ్మద్, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, సొసైటీ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ, కార్యదర్శి శ్రీరామ్మూర్తి, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు, రేమళ్ల కేదార్‌నాథ్, డాక్టర్ సత్యనారాయణ, మిండా హరి పాల్గొన్నారు.


మొద్దులగూడెంలో రచ్చబండ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

గోశాల అభివృద్ధిని అడ్డుకోవద్దు

మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం సమీపంలోని గోశాల అభివృద్ధిని అటవీ శాఖ అధికారులు అడ్డుకోవద్దని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశించారు. గోశాల వద్ద కొద్ది రోజుల క్రితం అదనపు షెడ్ల నిర్మాణ చేపట్టారు. ఈ పనులను స్థానిక అటవీశాఖ అధికారులు అడ్డుకుని, సామగ్రిని రేంజ్ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. గురువారం గోశాలను సందర్శించి నిర్వహకులతో మాట్లాడారు. అనంతరం అక్కడి నుంచే అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి గోశాల అభివృద్ధి అడ్డుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, సుంకవల్లి వీరభద్రం, ఆకుల శ్రీను, లయన్స్‌క్లబ్ బాధ్యులు యూఎస్ ప్రకాశ్‌రావు, శీమకుర్తి వెంకటేశ్వరరావు, జితేంద్ర ఉన్నారు.

శేషగిరినగర్‌లో కార్డెన్‌సెర్చ్


వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరుటౌన్: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అప్పుడే నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరినగర్‌లో మణుగూరు డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా తెల్లవారుజామున విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగునా క్షుణ్ణంగా పరిశీలిస్తూ.. నివసిస్తున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 37 మోటార్ వాహనాలు, రెండు ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. యువత గంజాయికి బానిసలు అవుతూ అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. నిషేధిత గంజాయి అమ్మినా సేవించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ మేడ ప్రసాద్, ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్, అశ్వాపురం ఎస్ఐ తిరుపతి, రవూఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భోజనం నాణ్యతలో విఫలం

మణుగూరురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యమైందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. మండలంలోని రుంధతి నగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యావ్యవస్థ దారుణంగా మారిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించడంలో నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి వితరణ

అశ్వాపురం: మొండికుంట గ్రామానికి చెందిన జంగిలి సోమయ్య దశదిన కార్యక్రమానికి గురువారం కాపు, మున్నూరుకాపు సంఘం నాయకులు హాజరయ్యి వారి కుటుంబానికి రూ 11,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంఘం అధ్యక్షుడు పర్వత నరేష్, నాయకులు తోట నర్సయ్య, పర్వత చందర్‌రావు, జెట్టి సాంబశివరావు, మామిడి శ్రీను, కమటం నరేష్, మల్లం ప్రభాకర్, కంపెల్లి శ్రీను నాయుడు, దండి రాములు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

గుండాల: మండలంలోని మారుమూల గ్రామానికి ఏళ్ల తరబడి రోడ్డు కోసం ఎదురు చూస్తున్న తరుణంలో బీటీ రోడ్డుకు నిధులు మంజూరు కావడంపై లక్ష్మీదేవిపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని కాచనపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గుతండా నుంచి లక్ష్మీదేవిపల్లి 4 కిలోమీటర్ల వరకు పంచాయతీ రాజ్ కింద రూ.2కోట్ల 50 లక్షలు బీటీ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు వచ్చేందుకు కృషి చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ధన్యవాదాలు తెలిపారు. కాగా, రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కోరుతున్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ


నోట్‌పుస్తకాలు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని ఆర్ కొత్తగూడెం ఎస్సీకాలనీ, బూరుగుపాడు, బోదనెల్లి, చింతగుప్ప గ్రామాల్లోని సుమారు 250 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు జోగిరిజు మాట్లాడారు. రానున్న రోజుల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలను మరిన్ని చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుర్రం రవికుమార్, గ్రామపెద్దలు కాకా నర్సింహారావు, కూరం వెంకటేశ్వర్లు, కేపా గణేష్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద నిఘా ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి రోడ్డులో ఉన్న చెక్‌పోస్టు వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. కాగా నాలుగు రాష్ట్రాలకు కేంద్ర బిందువుగా ఉన్న భద్రాచలం మీదగా ఇతర ప్రాంతాలకు పీడీఎస్ బియ్యం, గంజాయి, పశువుల అక్రమ రవాణాతో పాటు ఇతర ప్రభుత్వ నిషేధిత వస్తువుల రవాణా జరుగుతున్న కారణంగా పోలీసులు చెక్‌పోస్ట్ వద్ద నిఘా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా అశ్వాపురం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలంకు చెందిన ఎస్ఐలలో రోజుకు మూడు షిఫ్టుల వారిగా ఇద్దరు ఎస్ఐలు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే విధంగా ఎస్పీ రోహిత్ రాజు కార్యచరణ రూపొందించారు. భద్రాచలంలో ఈ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. కాగా ఇప్పటికే ఈ నిఘా ఏర్పాటు భద్రాచలంలో బుధవారం ఏర్పాటు కాగా, వీటితో పాటు భద్రాచలంలో ఉన్న నిర్వహణ లోపం కారణంగా నిలిచిపోయిన సీసీ కెమెరాలను కూడా వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఐక్యరాజ్యసమితి దినోత్సవం

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నల్లగట్ల సత్యప్రకాష్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే అంతర్జాతీయ పౌరుడిగా ప్రపంచంలో జరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులను అధ్యయనం చేసుకోవాలన్నారు. అనంతరం క్లబ్ కార్యదర్శి మీరాహుస్సేన్ అందరితో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం, విధులపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు క్లబ్ అధ్యక్షుడు సత్యప్రకాష్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ డాక్టర్ దుస్సా సమ్మయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఇందిరమ్మ కమిటీలతో కాలయాపన

పినపాక: ప్రభుత్వం పరిపాలన మరిచి ప్రకటనలతోనే కాలయాపన చేస్తోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. పేదవారికి ఇల్లు మంజూరు చేస్తామని చెప్పి ఇందిరమ్మ కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ, పార్టీలకు చెందిన వారిని ఇందిరమ్మ కమిటీలో చేర్చడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం కేటాయించి ఇళ్లకు నాయకులకు సంబంధమేమిటని ప్రశ్నించారు. అర్హులకు కాకుండా పార్టీలకు చెందిన వారికి ఇల్లు కేటాయిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ప్రకటనలు మాని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'కి వితరణ


దుమ్ముగూడెం: బాధిత కుటుంబానికి వితరణ అందజేస్తున్న ఆలయ వ్యవస్థాపకులు

మణుగూరుటౌన్: మండలానికి చెందిన వ్యాపారి కుంకుడుచెట్ల గుంపు అంగన్‌వాడీ సెంటర్‌కు 15 కుర్చీలు వితరణగా అందజేశారు. దోసపాటి ధర్మారావు–స్వర్ణల మనవడు దోసపాటి హేమంత్ పుట్టినరోజు సందర్భంగా రూ.3500 విలువైన 15 కుర్చీలు గురువారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్ర బాధ్యురాలు సుమ మాట్లాడుతూ.. దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దోసపాటి నరేందర్, మౌనిక, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు..

దుమ్ముగూడెం: మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన వాగే సత్యం ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన అయిన విషయం తెలిసిందే. కాగా బాధిత కుటుంబానికి గురువారం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్న అరుణాచలం వారు 25 కేజీల బియ్యం, రెండు వేల రూపాయలు విలువచేసే నిత్యవసర వస్తువులు, చీరలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపకుడు శివనాగ స్వామి, అరుణా సేవాగణం మహేష్, భార్గవ్ కృష్ణ,జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మాజీ చైర్మన్ కనుబుద్ది దేవా, కాంగ్రెస్ పార్టీ నాయకులు తెల్లం హరికృష్ణ, మాజీ ఉపసర్పంచ్ వాగే ఖాదర్ బాబు, కొమరం గజేంద్ర, వాగే పార్వతి పాల్గొన్నారు.

'మునగ' సేద్యంపై అవగాహన


దమ్మపేట: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ రవికుమార్

అన్నపురెడ్డిపల్లి: మునగ పంట సేద్యంపై మండలంలోని జానకీపురంలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో ఎంపీడీఓ మహాలక్ష్మి రైతునుద్దేశించి మాట్లాడుతూ.. మునగ పంట సేద్యంతో అధిక లాభాలు గడించవచ్చన్నారు. మునగ పంట సేద్యం చేసే రైతులకు ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా రాయితీ ఇస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ అనుష పాల్గొన్నారు.

దమ్మపేట: మునగ ఆకులు, దాని సంబంధిత ఉత్పత్తులను ఆహారంలో భాగంగా తీసుకుంటే రక్తహీనత తగ్గుతుందని వ్యవసాయ శాఖ నియోజకవర్గ సహాయ సంచాలకులు రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని నాగుపల్లి గ్రామంలోని రైతువేదికలో మునగ, వెదురు పంటల సాగుపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీఏ మాట్లాడుతూ.. మునగ, వెదురు పంటల సాగుపై ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను, సాగు విధానంలో అవలంబించే మెళకువలను సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్ రెడ్డి, హెచ్‌ఓ సందీప్, ఏఓ చంద్రశేఖరరెడ్డి, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

ఎంవీఐగా బాధ్యతలు స్వీకరణ


అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య

భద్రాచలం: భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా సంగం వెంకట పుల్లయ్య గురువారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జాగ్రత్తగా వాహనాలను డ్రైవింగ్ చేయాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని కోరారు.

సాయి ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు ప్రాంతానికి చెందిన బొల్లినేని వెంకట సత్యనారాయణ–పద్మావతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రాంప్రసాద్, ఇడుపులపాటి చైతన్య, శ్రావణి, విహాన్‌లు ఆలయంలోని సాయినాథుడిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం వెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సింగరేణి ఆస్పత్రి బృందం

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మణుగూరు ఏరియా సింగరేణి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సింగరేణి వైద్యులు వివిధ రుగ్మతలతో బాధపడుతున్న గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్ మాట్లాడుతూ.. సింగరేణి ఆస్పత్రిలో పంచాయతీ ప్రజలకు వైద్యసదుపాయాలు కల్పించాలని, ప్రతి నెలా సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది మండవ రామచంద్రయ్య, శ్రీకాంత్, పల్లపు వెంకటేశ్వర్లు, లేళ్ల ఉపేందర్, మల్లికంటి రాములు, సోడే సాయి, పంచాయతీ గుమస్తా రమేష్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పెద్దిపల్లి గ్రామస్తుల వినతి

మణుగూరురూరల్: తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ.. మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ పెద్దిపల్లి గ్రామస్తులు గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు స్థానిక ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యను ఎమ్మెల్యేకు విన్నవించుకుంటూ.. గత 30 ఏళ్లుగా పెద్దిపల్లిలో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. తమకు పోడు పట్టాలు ఇప్పిస్తామని చెప్పి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అటవీహక్కుల చైర్మన్‌గా పనిచేసిన మండారి సతీష్ అనే వ్యక్తి ఎకరాకి వెయ్యి రూపాయల చెప్పున 30 మంది వద్ద నుంచి రూ.90వేలను వసూలు చేశాడని తెలిపారు. సతీష్ పోడుభూములకు పట్టాలు ఇప్పించకపోగా.. ఎట్టి జోగయ్యకు చెందిన మూడున్నర ఎకరాలు, మడకం పెద్ద సోమయ్యకు చెందిన నాలుగు ఎకరాల భూమిని అక్రమ మార్గాన నాటి అధికారుల సహాయంతో తన పేరుమీద పట్టా చేయించుకున్నాడని తెలిపారు. ఇదేంటని ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి, బెదిరింపులకు పాల్పడుతున్నారని, సతీష్‌పై, అతనికి సహకరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెద్దిపల్లి గ్రామస్తులు ఎట్టి జోగయ్య, మడకం పెద్ద సోమయ్య, మడివి భీమయ్య, మడకం బాబురావు, తాటి దేవయ్య, కణితి భద్రయ్య, పురం భీమయ్య, సోడె ఉంగయ్య,ఎట్టి మాసయ్య, కారం సురేష్, పొడియం దేవయ్య, బాడిశ జోగయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పాయంకు వినతిపత్రం అందజేస్తున్న పెద్దిపల్లి గ్రామస్తులు